

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

అల్లూరి యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షునిగా వూటుకూరి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారని సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు మంగళవారం తెలిపారు.. ఈనెల 2న అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలో సంఘం జాతీయ మహాసభ జరిగిందన్నారు. 60 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యులుగా ప్రముఖ కార్టూనిస్టు మాడా రాముని ఎన్నుకున్నామనానరు. ఈ సందర్భంగా పలువురు సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభినందనలు తెలిపారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని జాతీయ రహదారుపై ప్రమాదాలను నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. ఇందులో భాగంగా ఐదు లేక ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి బ్లాక్ స్పాట్లుగా నిర్ధారించి నివారణ చర్యలు చేపడతామన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగం జిల్లాలో రహదారులు వెంబడి ప్రమాదాలు పొంచియున్న 53 ప్రాంతాలను ఇప్పటివరకు గుర్తించారన్నారు. ఎస్‌కెబిఆర్ కళాశాల చెంతన ఎత్తు రోడ్డు వద్ద, మహిపాల చెరువు, రావులపాలెం జూనియర్ కళాశాల, రావులపాలెం బస్టాండ్, ఈతకోట, నగరం జంక్షన్ తదితర ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించామన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కోటిపల్లి- యానాం ఏటిగట్టు పైలెట్ ప్రాజెక్ట్‌పై సభ్యులకు ఆయన వివరించారు. ఈ పైలెట్ ప్రాజెక్టులో ప్రమాదాలు జరగడానికి గల కారణాలను అన్వేషించారని తెలిపారు. గుంతలు, తుప్పలు ఉండటం, రెయిలింగ్‌లు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించారన్నారు. ఈ మేరకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇదే తరహాలో మిగిలిన రూట్లలోనూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ఆలమూరు, జొన్నాడ, ఈతకోట, ఐ.పోలవరం- అమలాపురం ప్రాంతాల్లో ప్రమాదాలు నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. జొన్నాడ బ్రిడ్జిపై లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ సిస్టం వాహనాలు నూతనంగా అందుబాటులో తేవాలని జాతీయ రహదారుల అధికారులకు సూచించారు. ప్రమాదాలు జరిగిన సందర్భంలో దగ్గరలోని ఆసుపత్రులకు వెళ్లేందుకు వివరాలు తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. 18 ఏళ్లలోపు పిల్లలు వాహనాలు నడుపరాదన్నారు. అమలాపురం పురవీధులలో పశువులు, కుక్కలు సంచారాన్ని రాత్రి వేళల్లో నిలుపు దల చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆలమూరు కొత్తపేటలలో ట్రామా కేర్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామనానరు. విద్యాసంస్థల్లో రోడ్ సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేసి రహదారి భద్రతా నియమాలపై అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. ఎస్‌పి ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపడం, సీటు బెల్టు లేకుండా కారులో ప్రయాణించడం రహదారి భద్రతా నియమాలకు విరుద్ధమన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలన్నారు. అనంతరం రహదారి భద్రతపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల పథక సంచాలకులు బి.సురేంద్రనాథ్, బి.సాయి శ్రీనివాస్, ఆర్‌డిఒలు ఎం.ముక్కంటి, వసంత రాయుడు, డిటిఒ అశోక్‌ప్రతాప్‌రావు, మున్సిపల్ కమిషనర్లు విఐపి.నాయుడు, కె.శ్రీకాంత్ రెడ్డి, డిసిహెచ్ఎస్ పద్మశ్రీరాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావుదొర, రవాణా శాఖ అధికారులు పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రహదారి భద్రతపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా, అధికారులు


గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న రైతు, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు

కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను తక్షణమే తొలగించాలి

బ్లాక్ డే సందర్భంగా రైతు సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

లఖీంపూర్ ఘటనకు సంబంధించి కేంద్ర సహాయ మంత్రి అజయ్‌మిశ్రాను తక్షణం మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని, అతని కుమారుడిని కఠినంగా శిక్షించాలని రైతు సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. లకీంపూర్ ఘటనపై అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం బ్లాక్ డేగా పాటించారు. గడియార స్తంభం సెంటర్‌లో కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర నాయకులు డేగా ప్రసాద్, కోనసీమ జిల్లా అధ్యక్షులు యాళ్ల బ్రహ్మానందం కన్వీనర్ కో-కన్వీనర్లు కె.సత్తిబాబు, కారెం వెంకటేశ్వరరావు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు మాట్లాడారు. రైతాంగం నల్ల చట్టాలు రద్దు చేయాలని పోరాటంలో అమరులైన రైతాంగ కుటుంబాల్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలన్నారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. రైతాంగానికి గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. రైతాంగ పోరాటంలో రైతు నాయకులుపై పెట్టిన కేసులను తక్షణమే కొట్టేయాలన్నారు. విద్యుత్ సంస్కరణ బిల్లుని తక్షణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం రైతాంగం పట్ల అనుసరిస్తున్న నిరంకుశ వైఖరి నశించాలన్నారు. లేకుంటే రాబోయే కాలంలో దేశవ్యాప్తంగా రైతాంగం మొత్తం సమీకరించి రైతాంగ ఉద్యమాల్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు జి.దుర్గాప్రసాద్ మచ్చా.నాగయ్య తదితరులు పాల్గొన్నారు



రిక్షా కార్మికుని కుమార్తె పెళ్లికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మండపేట

రిక్షా కార్మికుని కుమార్తె వివాహానికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్. ఏడో వార్డుకు చెందిన రిక్షా కార్మికుడు లంక జాన్ అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. ఆఖరి కుమార్తె సరోజనమ్మ వివాహం విషయంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతని కుటుంబ సభ్యులు శ్రీవరప్రకాష్‌ను మంగళవారం కలిశారు. స్పందించిన ఆయన పెళ్ళి కూతురు మేనమామ తాతబాబుకు రూ.10వేలను అదించారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి చాపల వీరబాబు, కిషోర్, ఏలుసూరి ఏసు, జై భీమ్ రిక్షా కార్మికులు పాల్గొన్నారు.

300 మందికి కంటి, దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరంలోని ఎసెంట్ పేపర్ మిల్లు మేనేజింగ్ డైరెక్టర్ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంకురాత్రి ఫౌండేషన్, శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి, అంజన దంత వైద్యశాల వైద్యులు సహకారం అందజేశారు. వ్యూహ్ లక్ష్మి పేపర్ మిల్ సిబ్బంది, కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పి.సత్యనారాయణ, దంత వైద్యులు డాక్టర్ సలాది వీరవెంకటేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన బి.వి.రావును పలువురు అభినందించారు.


దంత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు



ధర్మకృష్ణ దంపతులను సత్కరిస్తున్న సిఐ తదితరులు

ధర్మకృష్ణ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

హోం గార్డుగా 33 ఏళ్లపాటు పోలీసు శాఖలో పనిచేస్తూ శాంతి భద్రతలు కాపాడటంలో యల్లమిల్లి ధర్మకృష్ణ అందించిన సేవలు అభినందనీయమని అమలాపురం తాలూకా ఎస్ఐ అందే పరదేశి అన్నారు. ధర్మకృష్ణ ఉద్యోగ విరమణ సందర్భంగా తాలూకా పోలీస్‌స్టేషన్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. ధర్మకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులను రూరల్ సిఐ వీరబాబు ఆధ్వర్యంలో శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐలు ఏడుకొండలు, గోపాలకృష్ణ, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా చెముడులంక శివారు గాంధీనగరంలో రూ.37.7 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం గల ఆర్‌సిసి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ట్యాంక్ ద్వారా గ్రామంలో చాలా వరకూ తాగునీటి సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జడ్‌పిటిసి సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి, ఎఎంసి చైర్మన్ వై.నాగేశ్వరరావు, సర్పంచ్ గుణ్ణం రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ డివిఎల్.నరసింహారావు, ఎఇ పి.పద్మ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరుగుతున్నాయి. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు వీటిని ప్రారంభించారు.

మండపేట లోని స్థానిక బాలికోన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇప్పటికే వాలంటీర్లు, ఆర్యోగ సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించారన్నారు. రోగులను గుర్తించారని తెలిపారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జగనన్న సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు ఈ శిబిరాల్లో వైద్యసేవలు అందుతాయన్నారు. ప్రభుత్వ వైద్యులతో పాటు మేడికోవర్, అపోలో వంటి ప్రయివేటు ఆసుపత్రులకు చెందిన నిపుణులైన వైద్యులు ఈ శిబిరాల్లో సేవలందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కో-ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజాబాబు, కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్, కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, పిల్లి శ్రీనివాసు, మారిశెట్టి సత్యనారాయణ, కమిషనర్ టి.రామ్‌కుమార్, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, ఎఎంసి డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మావతి, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధరం తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** మండలం చెముడులంక శ్రీకష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష పథక వైద్య శిబిరాన్ని ఆర్‌డిఒ ఎం.ముక్కంటితో కలసి కలెక్టర్ హిమాన్షుశుక్లా మంగళవారం పరిశీలించారు. వైద్యశిబిరం నిర్వహణకు చేసిన ఏర్పాట్లపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ తమ్మన శ్రీనివాస్‌ను అభినిందించారు. మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ జి.అరుణ ఈ సందర్భంగా డెమో ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్టోబర్ 30 వరకు నెలరోజుల పాటు ఆయా సచివాలయాల పరిధిలో ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. ఐదుగురు రోగులను ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సల నిమిత్తం తరలించామని ఆరోగ్య మిత్ర వెంకట రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నేతలు దొండపాటి చంటి, అడబాల వీర్రాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, తహాశీల్దార్ ఐపి.శెట్టి, ఇఒపిఆర్‌డి రాజ్‌కుమార్, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** చినగాడవిల్లి సచివాలయంలో స్థానిక సర్పంచ్,వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జగనన్న ఆరోగ్య స్వరక్షతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తహాశీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి, వైద్యాధికారి ఎల్.నాగార్జున, ఇఒపిఆర్‌డి కెఎస్.గౌరీకుమారి, పంచాయతీ కార్యదర్శులు వర్రే నాగేంద్ర, తిక్కిరెడ్డి రామకృష్ణ,వీధి సత్యనారాయణ, వైద్య సిబ్బంది, అంగన్ వాడి,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** మండలంలోని అంకంపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. జడ్‌పిటిసి బోనం సాయిబాబా, ఎంపిడిఒ నాతి బుజ్జి ఈ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. ర్యాలి పిహెచ్‌సి వైద్యులు సునీత ఆధ్వర్యంలో వైద్యసేవలు నిర్వహించారు. జడ్‌పిటిసి సభ్యులు బోనం సాయిబాబా, ఆప్కాస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, సర్పంచి ముత్తాబత్తుల రాజు, నాయకులు గారపాటి గంగారాం చౌదర తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట** మండలం పలివెల ధర్మ సత్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎంపిడిఒ ఇ.మహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపిపి మార్గాన గంగాధరరావు, జడ్‌పిటిసి సభ్యులు రమాదేవి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గునిపే బేబిశ్యామల, కో-ఆప్షన్ సభ్యులు షేక్ బడేమియా, తుల సూరిబాబు, దేవస్థానం చైర్మన్ భమిడిపాటి లక్ష్మీ నారాయణ, ధర్మసత్రం చైర్మన్ చప్పిడి సాయిబాబా పాల్గొన్నారు. **మామిడికుదురు** మండలం పెదపట్నం లంక-1 సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరాన్ని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు పరిశీలించారు. పలు స్టాల్స్‌ను సందర్శించారు. ప్రజలందరికీ ప్రభుత్వం ద్వారా అత్యుత్తమ ఆరోగ్య సేవలు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి కారుపల్లి వెంకటేశ్వరరావు, ఇఒపిఆర్‌డి సురేష్, వైద్యాధికారులు డివి.సత్యం, కెజె.ప్రశాంత్, కె.స్వర్ణలత, స్పందన, రమ్య శైలజ, సర్పంచ్ సుందరనీడి చిన్ని, ఎంపిటిసి సభ్యులు కొమ్ముల జంగమయ్య, తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం :** ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు.కపిలేశ్వరపురం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐసిడిఎస్ పిఒ గజలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహారం కిట్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపిపి మేడిశెట్టి సత్యవేణిదుర్గారావు, జడ్‌పిటిసి పుట్టపూడి అబ్బు, ఎంపిటిసి సభ్యులు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి, తహాశీల్దార్ కె.సూర్యారావు, వైసిపి గ్రామ అధ్యక్షుడు కట్టా మురళీకృష్ణ, ఉప సర్పంచ్ బొక్క రాంబాబు, వైద్యాధికారులు, సిబ్బంది, అంగన్వాడి,ఆశ కార్యకర్తలు, పార్టీ నాయకులు,తదితరులు, పాల్గొన్నారు.


ఆలమూరులో డెమోను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా తదితరులు



పంచాయతీకి ఎసి బహుకరణ

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు మండలం కడలి గ్రామ పంచాయతీ కార్యాలయానికి మిరాకిల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ఈదా శ్రావణ్‌కుమార్ ఎసిని బహూకరించారు. సర్పంచ్ చొప్పల గుణనాథ్‌కు దీన్ని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.ముక్తేశ్వర రావు, ఎంపిడిఒ ఎన్.బాలాజీ, జడ్‌పిటిసి సభ్యులు మట్టా శైలజ, మెడికల్ ఆఫీసర్, శేఖర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌పిఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

బుద్ధ పార్కు ఆవరణలో ఆర్‌పిఐ ఆవిర్భావ దినోత్సం మంగళవారం శరత్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సామాజిక కార్యకర్త పచ్చిమాల బాబ్జి, ఆర్‌పిఐ నాయకుడు పెనుమాల సుధీర్ హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌పిఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భగా ఆర్‌పిఐ నాయకుడు పెనుమాల సుధీర్ మాట్లాడారు. రాజ్యాంగ పీఠికే మేనిఫెస్టోగా అంబేద్కర్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను స్థాపించారన్నారు. నేటి మనువాద పాలక పార్టీలు కులం, మతం పేరుతో అణగారిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలను ప్రలోభాలకు గురిచేసి విచ్ఛిన్నం చేస్తున్నాయన్నారు. ఈ సమయంలో ఆర్‌పిఐ రాజ్యాధికారం కోసం అందరూ ఐక్యంగా ఉండాలన్నారు.

రిసోర్స్‌పర్సన్ శిక్షణకు రామలక్ష్మి ఎంపిక

ప్రజాశక్తి - మండపేట

మైసూర్‌లోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఈ నెల 9 నుంచి 13వరకూ జరిగే రిసోర్స్ పర్సన్ శిక్షణకు జిల్లా నుంచి స్థానిక శ్రీ గౌతమీ మున్సిపల్ ఉన్నత పాఠశాల బయలాజికల్ టీచర్‌గా పని చేస్తున్న మేకా రామలక్ష్మిని ప్రభుత్వం ఎంపిక చేసిందని మెచ్ఎం శోభావళి తెలిపారు. ప్రస్తుతం రామలక్ష్మి గ్రీన్ కోర్ క్లస్టర్ కో-ఆర్డినేటర్‌గా ఉన్నారన్నారు. క్రియాత్మక విద్యపై ప్రయోగాలు నిర్వహించి రాష్ట్రస్థాయిలో గుర్తింపుపొందారన్నారు.

స్వామినాథన్, నాగేంద్రనాథ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఐ.పోలవరం

ప్రఖ్యాత వ్యసాయ శాస్త్ర వేత ఎంఎస్.స్వామినాథన్, రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు యర్నేని నాగేంద్రనాథ్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. మంగళవారం మురమళ్ల టిడిపి కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. వారి ఇద్దరి చిత్ర పటాలకి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మాట్లాడారు. స్వామినాథన్ సేవలను కొనియాడారు. మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద మాట్లాడుతూ రైతు సమస్యలపై పోరాటాలు చేస్తూ రైతు బాంధవుడుగా నాగేంద్రనాథ్ పేరొందారన్నారు. ఈ కార్యక్రమంలో కె.సూరపరాజు, జె.భీమరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు, వేగేశ్న సూర్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు అయినవిల్లిలో స్పందన వాయిదా

ప్రజాశక్తి - అమలాపురం

అయినవిల్లి మండలంలో బుధవారం జరగాల్సిన స్పందన కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది కలెక్టరేట్ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ 6న రాయవరం మండలంలో తదుపరి జగనన్నకు చెబుదాం కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కార్టూన్ 'నిజం'



అమలు కాని చట్టాలు ఏ భాషలో వుంటే ఏం?

గ్రామాల అభివృద్ధికి నిధుల కేటాయింపు

ప్రజాశక్తి - మామిడికుదురు

పి.గన్నవరం మండలాల్లో గ్రామాల అభివృద్ధికి మండల పరిషత్ నిధులను కేటాయించి సిసి రోడ్డుల నిర్మాణం, ఇతర మౌలిక వసతులను కల్పిస్తున్నామని ఎంపిపి అంబటి భూలక్ష్మి తెలిపారు. కుందాలపల్లిలో నాలుగు చోట్ల సిసి రోడ్ల నిర్మాణానికి, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆమె మంగళవారం శంకుస్థాపన చేశారు. అలాగే నరేంద్రపురంలో రెండు సిసి రోడ్ల నిర్మాణానికి, గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి, ముంగండలో సిసి రోడ్, గ్రావెల్ రోడ్ నిర్మాణానికి, తాగునీటి పైపులైన్ పనులకు సురక్షిత భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కుందాలపల్లి సర్పంచ్ పప్పుల శ్రీనివాస్, నరేంద్రపురం సర్పంచ్ బీరా వెంగమాంబ బాపూజీ, ఎంపిటిసి సభ్యులు పప్పుల సాయిబాబు, కొక్కిరి లక్ష్మి, ముంగండ గ్రామ ఉపసర్పంచ్ పెచ్చెట్టి వెర్రియ్య, మాజీ సర్పంచ్ నేలపూడి దుర్గారావు, పితాని రాంబాబు, అప్పారి సాయి, బొడ్డు సతీష్, షేక్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి భూలక్ష్మి

టిడిపి ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి - యంత్రాంగం

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ జిల్లాలో టిడిపి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష, నిరసనలు కొనసాగుతున్నాయి. **అమలాపురం** కలెక్టరేట్ వద్ద టిడిపి నిర్వహిస్తున్న దీక్షలు కొనసాగుతున్నాయి. మాజీ ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ దీక్షల్లో రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మెట్ల రమణబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచెట్టి చంద్రమౌళి పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు దీక్షల్లో కూర్చొన్నారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ సోంబాబు, టౌన్ అధ్యక్షులు తిక్కరెడ్డి నేతాజీ, మండలం అధ్యక్షులు మల్లుల పోలయ్య, దెందుకూరి సత్తిబాబురాజు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు పెచ్చెట్టి విజయలక్ష్మి పాల్గొన్నారు. **రామచంద్రపురంలో** చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 21వ రోజుకు చేరుకున్నాయి. రామచంద్రపురం పట్టణ రైతు సంఘం నాయకులు, రైతులు రిలే నిరాహారదీక్షల్లో పాల్గొన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడారు. ఆధారాలు లేని కేసులో చంద్రబాబును జైలుపాలు చేశారన్నారు. ఎపిలో సాగుతున్న అరాచక పాలనకు త్వరలోనే విముక్తి లభిస్తుందని విమర్శించారు. ఈ దీక్షలో ఉండవల్లి శివ, రావిపాటి రామకృష్ణారావు, బిక్కిన పవన్‌కుమార్, మేకా సురేష్, బిక్కిన రామచంద్రరావు, చెలంకూరి కృష్ణకళ్యాణ్, ముత్యాల శ్రీహరి, భీమ క్రోసు పాలెం దళిత యువకులు పాల్గొన్నారు. **మండపేట** మున్సిపల్ కార్యాలయం వద్ద ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు చంద్రబాబుకు మద్దతుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న సైకో రాజ్యాంగం పోవాలని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ దేశానికి ప్రసాదించిన ప్రజాస్వామ్య రాజ్యాంగం అమలు కావాలని, సైకిల్ అధికారంలోకి రావాలని నినాదాలు చేశారు. దీక్ష కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ పిల్లా తాతాలు, ఎంపిటిసి మాజీ సభ్యులు పసలపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, షేక్ సల్మాన్ సంఘీభావం తెలిపారు.


మండపేటలో నిర్వహిస్తున్న దీక్షల్లో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు



విద్యుత్ స్తంభంపై పాదుల తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - మండపేట

మండపేట పట్టణంలోని సత్యశ్రీ రోడ్డులోని విద్యుత్ స్తంభాన్ని అల్లుకుపోయిన పాదులను సిబ్బంది మంగళవారం తొలగించారు. ఈ పాదుల కారణంగా ప్రమాదం పొంచి ఉందని ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. వెంటనే పాదులను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

15 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం ప్రత్తిపాడు మండలాల్లో ఎస్ఇబి అధికారులు మంగళవారం దాడులు చేసి పెద్ద ఎత్తున బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఇబి సిఐ పి.అశోక్ మాట్లాడుతూ ధర్మవరం అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున నిర్వహించిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామంలో మహిళను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ప్రత్తిపాడు నైపుణ్య డిగ్రీ కాలేజీలో మద్యం, గంజాయి, డ్రగ్స్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి ఎస్ఐ బి.శ్రీనివాసరావు, సిబ్బంది వెంకన్న దొర, కృష్ణార్జున, ఆర్.దొరబాబు, ఎ.రాజు, రాంబాబు, వెంకటేశ్వరరావు, జ్యోతి పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా సిద్ధం కావాలి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

విద్యార్థులను ప్రతి పరీక్షకు పబ్లిక్ పరీక్షల మాదిరి సన్నద్ధం చేయడం ద్వారా పరీక్షలంటే భయం పోగొట్టడానికి వీలవుతుందని ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జె.డానియల్ రాజు పేర్కొన్నారు. మంగళవారం ఫార్మాటివ్-2 పరీక్షలను స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో పరిశీలించారు. విద్యార్థులను కొత్తగా మారిన పరీక్ష మోడల్‌పై ప్రశ్నించి సంతృప్తికరమైన జవాబులు పొందారు. బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో సిబిఎస్ఇ విధానంలో 8వ మరియు 9వ తరగతి విద్యార్థులకు 6వ తేదీ నుంచి పరీక్షల షెడ్యూల్ మారినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ, ఎంఇఒ-2 పి.పుల్లయ్య, టీచర్లు కె.అరుణ, కెవివి.సత్యనారాయణ, డివిఆర్ఎన్.వల్లి, వి.రాజు, జి.గోవింద్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - తాళ్లరేవు

వన్యప్రాణుల రక్షణ మన అందరి బాధ్యత అని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో జరిగిన ప్రారంభోత్సవ సభలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అటవీ శాఖ అధికారి జి.నరేంద్రన్ విద్యార్థులకు యుపిపిఎస్‌సి పరీక్షల్లో ఉపయోగపడే విషయాలను తెలిపారు. ఐబిసిఎన్ స్టేట్ కో ఆర్డినేటర్ మత్యుంజయరావు పక్షులను గుర్తించడం, వాటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో అన్నవరం డిగ్రీ మహిళా కళాశాల, కాకినాడ ఉమెన్స్ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు వసంత లక్ష్మి, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్, రీసెర్చ్ సైంటిస్ట్ మహేష్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

యానాం వార్తలు



రామలక్ష్మికి అవార్డు ను అందజేస్తున్న ఫెడరేషన్ సభ్యులు

రామలక్ష్మికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


ప్రజాశక్తి - యానాం

యానాం అంబేద్కర్ నగర్‌కు చెందిన మోర్త రామలక్ష్మి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం అక్షర్‌ధామ్ ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న రామలక్ష్మికి యుపిఎస్‌ఫెడరేషన్ (ఎపి) ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేసింది. ఈ అవార్డుల ప్రదానోత్సవ సభలో రామలక్ష్మికి ఫెడరేషన్ ప్రతినిధులు మెమెంటో అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

గ్యాస్ రాయితీకి నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో గ్యాస్ వినియోగదారులకు పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి ప్రకటించిన ఎల్పీజీ గ్యాస్ రాయితీ పథకానికి అనుమతి ఇచ్చే నిమిత్తం కేంద్ర పెట్రోలియం సహజవాయు మంత్రిత్వశాఖ గృహ వినియోగదారుల వివరాలు కోరింది. ఈ నేపథ్యంలో యానాం ప్రాంత లబ్దిదారులు తమ వివరాలను ఆన్లైన్లో సెల్ ఫోన్ ద్వారా అప్లోడ్ చేయాలని పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ సత్యమూర్తి ఒక ప్రకటనలో కోరారు. ఎరుపు రంగు రేషన్ కార్డుకు రూ.300, పసుపు రంగు రేషన్ కార్డుకు రూ.150 చొప్పున లబ్ధిదారులకు వంట గ్యాస్ సిలిండర్‌పై రాయితీ ఇస్తామని సిఎం రంగస్వామి ప్రకటించారు. యానాం వినియోగదారులు తమ గ్యాస్ ఏజెన్సీ పేరు, వినియోగదారు సంఖ్య, రిజిస్టర్డ్ మొబైల్ లేదా ఫోన్ నంబరు, రేషన్ కార్డు, ఆధార్ సంఖ్యలను వెంటనే నమోదు చేయాలన్నారు. మొబైల్ యాప్ ద్వారా వివరాల నమోదుకు http:///dcsca.py.gov.in, వెబ్సైట్ ద్వారా అప్లోడ్ చేయడానికి http:pdsswo.py.gov.in/lpg వినియోగించాలన్నారు. సందేహాలుంటే స్థానిక పౌర సరఫరాల శాఖను సంప్రదించాలని తెలిపారు.



సత్యనారాయణను సత్కరిస్తున్న ఉద్యోగులు

అంకితభావంతో పని చేయాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఉద్యోగులు అంకితభావంతో పని చేసిన నాడు ప్రమోషన్స్ వెతుక్కుంటూ వస్తాయని ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డిఎస్ఆర్ సత్యనారాయణకు సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ లభించడంతో ఆయనను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ మంచి పేరు తెచ్చుకునే ఉద్యోగి అన్నారు. ఎంపిడిఒ ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ సత్యనారాయణ పదోన్నతిపై పిఠాపురం బదిలీపై ఆయన మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజేశ్వరి, ఎంపిటిసి ఇజ్జనగిరి ప్రసాద్, కొప్పుల బాబ్జి, సర్పంచులు బీశెట్టి అప్పలరాజు, సూతి వీర కృష్ణప్రసాద్, పసల వెంకటరమణ, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నివాస ప్రాంతాల వద్ద ఇళ్ల స్థలాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 11 ఏటిపట్టు గ్రామాలకు చెందిన 1,980 మంది లబ్ధిదారులకు 18 కిలోమీటర్ల దూరంలో రామేశం మెట్ట వద్ద స్థలాలు కేటాయించటం అన్యాయమని, లబ్ధిదారులకు నివాస ప్రాంతాలకు దగ్గర్లోనే స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం చంద్రమాంపల్లి-దివిలి సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ వ్యవసాయ పనులపై ఆధారపడిన గ్రామీణ లబ్ధిదారులకు గ్రామ సమీపంలో కాక ఎక్కడో ఇళ్ల స్థలాలు ఇస్తే అక్కడకు వెళ్లి ఎలా నివసిస్తారని ప్రశ్నించారు. ఇచ్చిన స్థలాల ప్రాంతం కూడా రాళ్లు రప్పలతో నిండి ఉందన్నారు. ఈ స్థలాన్ని అధికారులు పరిశీలించారా అని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన ఇళ్ల స్థలాలు వదులుకోలేక, అక్కడ ఇళ్లు కట్టుకోలేక లబ్ధిదారులు అయోమయంలో ఉన్నారన్నారు. ప్రతి గ్రామంలో లబ్ధిదారులకు గ్రామ సమీపంలో స్థలాలు కొని ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఈ సమస్యను పరిష్కరించాలని, లేదంటే తామే



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళతామన్నారు. టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, జనసేన మండల ప్రచార కార్యదర్శి కంటి బోయిన ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిరపరపు శ్రీనివాస్, గరగపాటి పెంటయ్య, మాగాపు నాగు, మంతెన సత్తిబాబు, పాపేశ్వరరావు, మొయిళ్ళ కృష్ణమూర్తి, తుమ్మల నాని, రేలంగి బుజ్జి, ఎగ్గాడ శ్రీను, రేలంగి వెంకట్రావు, రామకోటి, వెన్నా వెంకటేష్, కంటిబోయిన కొండలరావు, బత్తుల శ్రీనివాస్, సాలిపల్లి వెంకన్న, కొట్టు సత్తిబాబు, దాట్ల విజయబాబు, కొమ్మిరెడ్డి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రపాలెం గ్రామాభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఇంద్రపాలెం అభివృద్ధికి ఎంఎల్ఎ కురసాల కన్నబాబు సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ రూరల్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గీశాల శ్రీను వెల్లడించారు. స్థానిక వెంకటరమణ నగర్‌లో మంగళశారం సిసి రోడ్డు నిర్మాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి గ్రామాల అభివృద్ధికి కషి చేస్తున్నారని అందులో భాగంగా ఇంద్రపాలెం గ్రామానికి 4 సచివాలయాలు మంజూరు చేశారన్నారు. ఇప్పటికే మూడు సచివాలయాలు అందుబాటులోకి వచ్చి ప్రజలకు సేవలు అందిస్తున్నాయని, మరో సచివాలయం త్వరలోనే అందుబాటులోకి రానుందని తెలిపారు. ఇటీవల ఎంఎల్ఎ కన్నబాబు నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా ప్రజల సమస్యలను గుర్తించినట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయానికి రూ.40 లక్షల నిధులు విడుదల చేసిందన్నారు. ప్రజా



అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రూ.10 లక్షల వ్యయంతో నూతన సిసి రోడ్ల నిర్మాణం పటిష్టంగా ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు సూరంపూడి మాధవ, పలివెల శ్రీను, శాంతి కుమార్ పాల్గొన్నారు.

ఆదిత్య కాలేజిలో త్రీడీ మోడలింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఎపి రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సారథ్యంలో 'రెవిట్ ఆర్కిటెక్చర్ సాఫ్ట్వేర్ ద్వారా త్రీ డీ మోడలింగ్' అనే అంశంపై ఆరు రోజుల విద్యార్థుల అభివృద్ధి శిక్షణ కార్యక్రమం ఘనంగా ముగిసిందని ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలపారు. ఈ కార్యక్రమానికి ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో విశేష సేవలు అందిస్తున్న బిడి.నాయుడు ప్రస్తుత సమాజంలో రెవిట్ ఆర్కిటెక్చర్ సాఫ్ట్వేర్, త్రీడీ మోడలింగ్ ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ఈ రంగంలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో తృతీయ, నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఎన్నో సందేహాలను అడిగి నివత్తి



చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్ డాక్టర్ పుల్లెల రవి కుమార్, విభాగాధిపతి డాక్టర్ వి.స్వామినాథ్, కోఆర్డినేటర్స్ ఎస్.నాగేంద్ర, డి.నోయెల్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-పెదపూడి

గ్రామాభివృద్ధికి అందరు సహకరించాలని ఎపిత్రయం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ గుండా ఈశ్వరరావు అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. డ్రెయినేజీ రోడ్లు, మొదలగు వాటి నిర్మాణాలపై చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు బాధ్యతగా, నిబంధనల ప్రకారం ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎం.సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ అనురాధ, ఎంపిటిసి పెండెం జ్ఞాన ప్రసూన, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలాత్రిపుర సుందరి పాల్గొన్నారు.

In The Court Of The Principal Junior Civil Judge :: Kakinada
O.S.No. 363/2019

Between:
Vasamsetti Simhachalam ...*Plaintiff*
AND
Pampana Durga Prasad ...*Defendant*

TO: Defendant:
Pampana Durga Prasad, S/o. Anjaneyulu, Aged 33 Years, Business, D.No. 3-249, Madhavapatnam, Samalkota Mandal.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.27-10-2023వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కఠ్లా వేణు, అడ్వకేట్,
దంటువారి వీధి, కాకినాడ.
సెల్: 98495 48272

In The Court Of The 5th Additional Junior Civil Judge :: Kakinada
I.A.No. 106/2022
in O.S.No. 331/2022

Between:
Kovvuri Veera Raghava Reddy ...*Petitioner /Plaintiff*
AND
Gunnam Pallayya and Others ...*Respondents/ Defendants*

TO: 1st Defendant:
Gunnam Pallayya, S/o. Rudrayya, Aged 80 Yrs, Landlord, D.No. 3-24, Sahapuram (V), Pedapudi (M).

పై నెంబరు కేసులో మీకెన్నిసార్లు నోటీసులు పంపిననూ, తీసుకొనక తప్పించుకు తిరుగుచున్నారు. మీ హాజరు నిమిత్తం **ది.12-10-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు వాయిదా అయి ఉన్నది.** అట్లు మీరు హాజరు కానిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎ.వి.సిహెచ్.ఎస్.ఎస్.మూర్తి
ఎ.సిద్ధ్వి రమణ కశ్యప్
అడ్వకేట్స్, కాకినాడ.
సెల్: 98483 38335

రహదారి ఇలా... ప్రయాణం ఎలా?

పూర్తిగా శిథిలమైన ఈ రహదారి రాజమహేంద్రవరం నగరంలోని బాలాజీపేటలోనిది. బాలాజీ పేట దుర్గమ్మ గుడి సెంటర్ నుంచి ఫ్లైఓవర్ వరకూ ఉన్న ఈ రోడ్డు పూర్తిగా పాడైంది. గుంతలతో, బురదతో ఇలా దర్శనమిస్తోంది. బొమ్మూరు, ధవళేశ్వరం, వేమగిరి, కడియం తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనచోదకులు నిత్యం ఇదే రోడ్డు గుండా ప్రయాణిస్తారు. అలాగే సత్యసాయి గురుకులం, సెంటాన్స్ తదితర విద్యాసంస్థలకు చెందిన విద్యార్థుల ఆటోలు, బస్సులు ఇదే మార్గం గుండా వెళ్తుంటాయి. గుంతలతో ప్రమాదకరంగా మారడంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. గుంతల్లో నీరు చేరడంతో వాహనచోదకులు పడిపోయి ప్రమాదాల బారిన పడుతున్నారు.

:: ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్ ::







In The Court Of The 1st Additional Junior Civil Judge :: Kakinada
O.S.No. 753/2020

Between:
Canara Bank (Erstwhile Syndicate Bank, Dairy Farm Centre Branch, Kakinada, Rep. by its Senior Branch Manager) ...*Plaintiff*
AND
Anala Satyaveni ...*Defendant*

TO: Anala Satyaveni, W/o. Late Rambabu, Aged 43 Yrs, Business, D.No. 3-17-50/3, Engineering Collage, Kannayyakapu Nagar, Kakinada.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.18-10-2023వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వేగుళ్ళ వెంకట రమణమూర్తి
అడ్వకేట్, గాంధీ నగర్, కాకినాడ.
సెల్: 98660 33899

In The Court Of The 5th Additional Junior Civil Judge :: Kakinada
O.S.No. 331/2022

Between:
Kovvuri Veera Raghava Reddy ...*Petitioner /Plaintiff*
AND
Gunnam Pallayya and Others ...*Respondents/ Defendants*

TO: 1st Defendant:
Gunnam Pallayya, S/o. Rudrayya, Aged 80 Yrs, Landlord, D.No. 3-24, Sahapuram (V), Pedapudi (M).

పై నెంబరు కేసులో మీకెన్నిసార్లు నోటీసులు పంపిననూ, తీసుకొనక తప్పించుకు తిరుగుచున్నారు. మీ హాజరు నిమిత్తం **ది.12-10-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు వాయిదా అయి ఉన్నది.** అట్లు మీరు హాజరు కానిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎ.వి.సిహెచ్.ఎస్.ఎస్.మూర్తి
ఎ.సిద్ధ్వి రమణ కశ్యప్
అడ్వకేట్స్, కాకినాడ.
సెల్: 98483 38335

సిఎం పర్యటన మళ్లీ వాయిదా

ఈ నెల 9,10 తేదీల్లో ఉండే అవకాశం?

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోటలో ముఖ్యమంత్రి జగన్ పర్యటన వాయిదాల పరంపర కొనసాగుతోంది. ఈ నెల 5వ తేదీన సిఎం పర్యటనను ఖరారు చేశారు. మంత్రి జోగి రమేష్ తదితరులు సైతం ఏర్పాట్లను పరిశీలించారు. అయితే తాజాగా ఈ పర్యటన మళ్లీ వాయిదాపడింది. తొలుత ఈ ఏడాది ఆగస్టు 20 నుంచి 23వ తేదీల మధ్యలో సిఎం పర్యటన ఉంటుందని తొలుత అధికారులు సమీక్ష సమావేశంలో ప్రకటించారు. తదుపరి రెండు రోజులు ముందుగానే ఆగస్టు 18న పర్యటన ఉంటున్నట్లు వార్తలు వినిపించాయి. అది కాస్తా ఆగస్టు 28కి వాయిదా పడింది. తదుపరి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు మౌలిక వసతుల కల్పన పనులు పూర్తిస్థాయిలో జరగని కారణంగా మరోమారు సీఎం పర్యటన తేదీని వాయిదా వేస్తూ సెప్టెంబర్ 5వ తేదీకి ముహూర్తం ఖరారు చేశారు. అయితే అనివార్య కారణాలవల్ల ఆ తేదీని కూడా వాయిదా వేశారు. ఈసారి కూడా పర్యటన వాయిదా పడడంతో అధికారులు, లబ్ధిదారుల్లో కొంత నిరాశ ఎదురైంది. నెలలు తరబడి కలెక్టర్ కృతికాశుక్లాతో పాటూ పలు శాఖల జిల్లా అధికారులు సామర్లకోట లోనే ఉండి రేయింబవళ్లు కష్టపడి పనిచేసి జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు దాదాపు పూర్తి చేయించారు. సిఎం చేతుల మీదుగా సామూహిక గృహప్రవేశాలు పూర్తయితే ఊపిరి పీల్చుకునేందుకు అధికారులు అంతా ఎదురు చూస్తున్నారు. వాయిదా పడటంతో అధికారులంతా అయోమయానికి గురవుతున్నారు. ఈ నెల 5న ఢిల్లీ పర్యటన ఖరారు కావడంతో సామర్లకోట పర్యటనను వాయిదా వేసినట్లు సమాచారం. ఈ నెల 9 10 తేదీల్లో అయినా పర్యటన ఉంటుందా లేదా అని మీమాంసలో ప్రజలు, అధికారులు ఉన్నారు.

104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - అమలాపురం

104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఉద్యోగుల సంఘం డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం యుటిఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు పి.వంశీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో, జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమంలో 104 ఉద్యోగులు ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. మారుమూల ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలు అందించడంలో 104 ఉద్యోగుల కృషి ఎంతో ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు మాట్లాడుతూ 104



సేవలను గతంలో మాదిరిగా ప్రభుత్వమే నిర్వర్తించాలన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి, 104 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కె.ఓంప్రకాష్, ఎం.జగజ్జీవన్‌రావు, జి.శ్రీనివాస్, రవి, చందు, సతీష్, విజయ్, 104 ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్‌డిఒ సమావేశం

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎస్‌పి నియోజకవర్గానికి సంబంధించి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్ఎస్‌విబి.వసంతరాయుడు అధ్యక్షతన రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజీకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో సాధారణ నివాసి అంటే 6 నెలల పైబడి అదే ఊరిలో నివాసం ఉంటే సాధారణ నివాసిగా పరిగణించేవారన్నారు. ప్రస్తుతం నిబంధనల ప్రకారం ఆ ఊరిలో నివాసం ఉంటే సాధారణ నివాసిగా పరిగణించొచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో ఎఇఆర్‌ఒలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు బడుగు సత్యనారాయణ, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఎ సోదాలతో ప్రజాస్వామ్య విలువలకు విఘాతం

ప్రజాశక్తి - అమలాపురం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని మానవ హక్కుల వేదిక కార్యకర్తల ఇళ్లలో ఈ నెల రెండో తేదీన ఎన్ఐఎ సోదాలు నిర్వహించడాన్ని మానవ హక్కుల వేదిక తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లాల శాఖలు తీవ్రంగా ఖండిస్తున్నాయని జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు తెలిపారు. మానవ హక్కులకు విఘాతం కలుగుతున్న సందర్భాల్లో రాజ్యాంగ బద్ధంగా ప్రశ్నించడం, న్యాయం కోసం పోరాడటం ప్రజాస్వామ్య వ్యవస్థలో కనీస కర్తవ్యాలుగా భావించాలన్నారు. నానాటికీ ప్రశ్నించే గొంతుకల్ని అణచివేయడం, కార్యకర్తల్ని వేధించడం ప్రభుత్వ అసహనానికి నిదర్శనాలుగా రుజువు అవుతోందని రాష్ట్ర నాయకులు ఎ.రవి అన్నారు. ఈ నేపథ్యంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్ ఇంట్లో సోదాలు చేయడాన్ని ఈ కోణంలోనే చూడాల్సి వస్తుందన్నారు. వాస్తవానికి మానవ హక్కుల వేదిక ఒక స్వతంత్రమైన హక్కుల సంఘంగా 1998లో డాక్టర్ కె.బాలగోపాల్ ఆధ్వర్యంలో ఆవిర్భవించిందన్నారు. ఈ సంఘానికి ఏ రాజకీయ పార్టీలతో, అతివాద సంస్థలతోను, మావోయిస్టు పార్టీలతో ఎలాంటి అనుబంధం లేదన్నారు. ఈ దృక్పథంతోనే మానవ హక్కుల వేదిక గడచిన పాతికేళ్ల నుంచి ప్రజాస్వామ్య బద్ధంగా కార్యక్రమాలు నిర్వహిస్తోందని జిల్లా అధ్యక్షులు మహ్మద్ ఇక్బాల్ అన్నారు. యేడిద రాజేష్ ఇంట్లో జరిగిన సోదాల్ని మానవ హక్కుల వేదిక తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ విధమైన చర్యల్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 73/2022

బిట్వీన్:
సానబోయిన భైరవ మూర్తి ...వాది
అండ్
పెన్మత్స వంశీ కృష్ణ రాజు ...ప్రతివాది

To: Penmatcha Vamsi Krishna Raju, S/o. Late Ramakrishna Raju, Hindu, Student, C/o. Penmatcha Vital Raju, Door No. 33-8-2, Kanchirajugari Street, Oppst. Town Hall Complex, Tanuku, Presently Working at GSPL Medical College, Rajamahendravaram.

ఈ పై నెంబర్ దావాను వాది మీ పై మీ తండ్రి గారు వాది గారి వద్ద అప్పు తీసుకొని వ్రాయించి ఇచ్చిన ప్రామిసరీ నోటు బాకీ అసలు ఫాయిదాలు తాలూకు వసూలు మున్నగు పరిహారములు కోరుచూ దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాతోపాటు మీపై వాది గారు మీ తాలూకు పిటీషన్ షెడ్యూల్ దాఖలా ఆస్తిని జప్తు చేయించామని కోరుచు I.A.No.257/2022 పిటీషను దాఖలు చేసియున్నారు సదరు దావా లో మీకు సమన్లు నిమిత్తం మరియు I.A.No.257/2022 పిటీషనులో మీకు నోటీసులు అమలు నిమిత్తం మీ హాజరు నిమిత్తం వాయిదా **ది.31-10-2023 వ తేదీ అయి ఉన్నది.** కావున మీరు వాయిదా రోజున ఉదయం గం.10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. అట్లు కానీ యెడల మీ పరోక్షమందున తీర్మానింపబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతం రాజు
శ్రీ గుత్తుల శ్రీనివాస రావు
ముమ్మిడివరం, అడ్వకేట్స్, ముమ్మిడివరం
30-9-23. సెల్: 94400 41751

In The Court Of The 1st Additional Junior Civil Judge :: Kakinada
O.S.No. 416/2022

Between:
Pithani Srinivasa Rao ...*Plaintiff*
AND
Yalla Satyavathi ...*Defendant*

TO: Defendant:
Yalla Satyavathi, W/o. Paparao, Aged 70 Years, House Wife, R/o. D.No. 3-4-2, Ganapathi Nagara, Uppumilli Village, Kajuluru Mandal.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 17-10-2023వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
డి.సుబ్రహ్మణ్యం,
వి.వి.వి.ఎస్.ఎల్.కిరణ్,
ఎం.ధనుంజయరావు,
అడ్వకేట్స్, కాకినాడ.
సెల్: 98497 15132